


*మగధీర సినిమాకి మాతృకగా వివాదాల్లోకి ఎక్కిన నవల.*

*రచయిత ప్రత్యేక అనుమతితో  పునర్ముద్రణ.*

*(గత సంచిక తరువాయి)*

## 5

**చండేరీ చీరల గురించి మంచి** వొడ్డూ పొడుగూ గల యువతికోసం అన్వేషిస్తున్న జియాజీరావుకు వెదకబోయినతీగ కాలికి తగిలినట్టయింది.

అప్పుడు హైమవతికి ఇరవై ఏళ్ళుంటాయి.

అమాయకంగా, అందంగా కనిపించే ఆమెతో కొన్ని సినిమాల్ని తీస్తే చాలా బావుంటుందనే ఆశతో ఉన్న అతని ఆశలు కాస్తా వెంటనే అడియాశలైపోయాయి.

జియాజీరావు కొత్తగా అక్కడికి చేరిన నెల తిరగకముందే హైమవతికి పెళ్ళయిపోయింది. ఆ వెంటనే అత్తవారింటికి వెళ్ళిపోయిందామె.

హైమవతికి నాలుగేళ్ళ వయస్సు నిండకుండానే మొగుడ్ని వదిలేసి మరొకడితో లేచిపోయిందామె తల్లి.

అప్పటినుంచీ తల్లీ తండ్రీ అన్నీ తానే అయి హైమవతిని పెంచి పెద్దచేసాడు ఉమ్రావ్ సింగ్,

భార్య లేచిపోవడంతో ఉమ్రావ్ సింగ్‌ని అతని బంధువర్గం చాలా చిన్నచూపు చూసింది. బంధువుల రాకపోకలన్నీ తగ్గిపోయి దాదాపు సంఘం నుంచి వెలివేయబడిన వ్యక్తిలా కాలాన్ని వెళ్ళదీసాడతను.

ఆ సమయంలో భవానీప్రసాద్ గ్వాలియర్ ఫారెస్ట్ రేంజిలో పనిచేసేవాడు. కానీ అతని జ్యూరిస్ డిక్షన్ చండేరీ అడవులదాకా చేరింది. అందుకే అతను తరుచూ వచ్చి చండేరీ గెస్ట్‌హౌస్‌లో బసచేస్తూనే ఉండేవాడు.

భవానీప్రసాద్ గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటూ వుండగా కాలక్షేపం కోసం ఉమ్రావ్‌సింగ్ వాటాలోకి వచ్చేవాడు రామ్‌సింగ్.

కూతురు హైమవతితో ఒంటరిగా ఉంటున్న ఉమ్రావ్‌సింగ్‌కు రామ్‌సింగ్ రాకపోకలు నచ్చాయి.

తండ్రితో రామ్‌సింగ్ చెబుతూ ఉండే కబుర్లలో అప్పుడప్పుడు తానుకూడా పాలుపంచుకుంటూ ఉండేది హైమవతి.

కొన్నాళ్ళలా గడిచేసరికి ఆ ఇంటికి ఆప్తుడుగా మారిపోయాడు రామ్‌సింగ్.

అలా పెరిగిన రామ్‌సింగ్ పరిచయం ఉమ్రావ్‌సింగ్ పై ఎంతో ప్రభావాన్ని చూపించింది. దాంతో కొంతకాలం తర్వాత హైమవతిని రామ్‌సింగ్ కిచ్చి పెళ్ళిచేయాలనే నిర్ణయానికి వచ్చేసాడు ఉమ్రావ్‌సింగ్.

అతనా నిర్ణయానికి రావడానికిగల కారణం జియాజీరావు అనడంలో అసత్యం ఏమీలేదు.

జియాజీరావు ఆ గెస్ట్‌హౌస్‌లో నివసించడం మొదలెట్టినప్పటినుంచే అతని కళ్ళు హైమవతిపైనే పడిపోయాయి.

హైమవతి దృష్టిలో పడాలన్న తాపత్రయంతో వాకింగ్ వంకతో ఉమ్రావ్‌సింగ్ వాటా ముందునుంచీ పచార్లు ప్రారంభించాడతను.

జియాజీరావు ధోరణిని జీర్ణించుకోలేకపోయాడు ఉమ్రావ్‌సింగ్. అందుకే కూతురుకు పెళ్ళిచేసేసి వెంటనే ఆమెని అక్కడనుంచి అత్తవారింటికి పంపేయాలనే బలమైన నిర్ణయాన్ని వెంటనే తీసుకోవాల్సి వచ్చిందతను.

ఆ కారణంగానే హైమవతికన్నా వయసులో కొంచెం పెద్దవాడయినా కూడా లెక్కచేయకుండా రామ్‌సింగ్‌ని అల్లుడ్ని చేసుకున్నాడు ఉమ్రావ్‌సింగ్.

తను ఊహించని విధంగా తన కూతురినిచ్చి పెళ్ళిచేస్తానంటూ ముందుకొచ్చిన ఉమ్రావ్‌సింగ్ అభ్యర్ధనని త్రోసిపడవేయలేదు రామ్‌సింగ్. వెంటనే హైవతితో పెళ్ళికి ఒప్పుకున్నాడతను.

తండ్రి పరిస్థితిని పూర్తిగా అవగాహన చేసుకున్న హైమవతి కూడా ఆ పెళ్ళికి అంగీకరించక తప్పలేదు.

ఆ తర్వాత చండేరీలోని దుర్గామాత ఆలయంలో హైమవతి, రామ్‌సింగ్‌ల పెళ్ళి నిరాడంబరంగా జరిగిపోయింది. వారి పెళ్ళికి బంధువులెవరూ రాలేదు.

చడీ చప్పుడు లేకుండా నిశ్శబ్దంగా జరిగిపోయిన తన పెళ్ళి గురించి ఆ తర్వాత హైమవతి విచారించని క్షణంలేదు.

జియాజీరావ్ గెస్ట్ హౌస్‌లో ఉన్నా అతన్నెప్పుడూ హైమవతి చూడలేదు.

ప్రతిరోజూ హైమవతి అక్కడున్నన్ని రోజులూ ఆమెనే చాటుమాటునుంచీ గమనిస్తూ ఉండేవాడు జియాజీరావు.

పెళ్ళయిన మూడో రోజునాడే భర్తవెంట అత్తవారింటికి వెళ్ళిపోయింది హైమవతి.

వయసొచ్చిన ఆడపిల్ల తనవెంట ఒంటరిగా ఆ అడవిలో ఉండవలసి రావడం అంతవరకూ ఉమ్రావ్‌సింగ్‌ని ఎంతో బాధిస్తూ ఉండేది. తల్లిలేని వయసులో ఉన్న ఆ ఆడపిల్లకి ఎప్పుడు ఏం ఆపద వాటిల్లుతుందో నన్న భయం అతన్నెప్పుడూ పట్టిపీడిస్తూ ఉండేది.

అందుకే తన కూతురిపై కన్నేసిన జియాజీరావును చూసి హడలిపోయాడు ఉమ్రావ్‌సింగ్.

హైమవతికి పెళ్ళికాగానే అతని గుండెలు కాస్తా కుదుటపడిపోయాయి.

ఈలోగా రామ్‌సింగ్‌కి ఓర్ఛాకు బదిలీ అయింది.

తను గ్వాలియర్ నుంచి ట్రాన్స్‌ఫర్ అయిపోతూ అతన్ని కూడా తనవెంటే తీసుకువెళ్ళాడు భవానీప్రసాద్.

ఓర్ఛా ప్యాలెస్ అప్పుడు మధ్యప్రదేశ్ ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ ఆధీనంలో ఉండేది. ఆ ప్యాలెస్ ప్రహరీగోడలనుంచే దట్టమైన అరణ్యం అలుముకుని ఉండేది.

ఆ ఓర్ఛా ప్యాలెస్‌లోని ఓనాటి సైన్యాధికారి గృహాన్ని భవానీ ప్రసాద్‌కి అధికార గృహంగా ఏర్పాటు చేసారు.

ఓర్ఛా ప్యాలెస్ ఆవరణలోనే ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన మరికొన్ని కుటుంబాలు ఉండేవి. వారిలో ఓ కుటుంబానికి హైమవతి బాధ్యతని అప్పగించి భవానీప్రసాద్ పెళ్ళిని చూడటం కోసం వెళ్ళిపోయాడు రామ్‌సింగ్.

భర్త తననలా ఒంటరిగా వదిలిపెట్టి వెళ్ళడంతో మొదట కొంచెం భయం వేసినా ఆ తర్వాత సర్దుకుంది హైమవతి.

పుట్టినప్పటినుంచీ ఆమెకు తల్లెవరో జ్ఞాపకంలేదు. తనను పెంచి పెద్దచేసిన తండ్రిని మొదటిసారిగా అదీ తనకు ఇరవై ఏళ్ళ వయసు వచ్చాక ఇప్పుడిలా వదిలిపెట్టడం జరిగింది.

మగ పెంపకంలో పెరిగిన హైమవతికి అసలు ఆలూమగల బాంధవ్యం ఏమిటో తెలీదు. దాంపత్యానికి కావాల్సిన లక్షణాలేమిటో ఆమెకెవరూ చెప్పేవాళ్ళు లేకపోయారు. భార్యాభరల మధ్యనున్న అనుబంధం అంటే ఏమిటో ఆమె ఎరుగదు.

రామ్‌సింగ్ నుంచి ఆమె ఏ అనుభవాన్నీ రుచి చూడకపోవడమే అందుకుగల కారణంగా చెప్పుకోవాల్సి ఉంటుంది.

కానీ రామ్‌సింగ్ లేని ఆ మూడురోజుల్లోనే హైమవతికి ప్రపంచం అంటే ఏమిటో కొంచెం అర్థమైంది. ఓర్చా ప్యాలెస్ ఆవరణలో ఉన్న ఆ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారి కుటుంబాలవల్ల ఆమెకు విషయాలన్నీ తెలిసిపోయాయి.

జీవితానికి కావాల్సిందేమిటో తెలిసాక భర్త తిరిగి రావడం కోసం ఆసక్తిగా నూతనోత్సాహంతో ఎదురుచూడసాగిందామె. ఆ ఉత్సాహం కారణంగానే తాను గత ఇరవైఏళ్ళ తర్వాత మొట్టమొదటిసారిగా తండ్రిని వదిలిపెట్టేసి వచ్చిన విషయం కలిగించిన బాధని కూడా తాత్కాలికంగా మరచిపోయిందామె.

వారం రోజుల తర్వాత కొత్తగా పెళ్ళయిన భవానీప్రసాద్ దంపతులతో తిరిగి వచ్చాడు రామ్‌సింగ్.

పెళ్ళయ్యాక అత్తవారింటికి బదులుగా ఏకంగా భర్త ఇంటికే వచ్చేసింది అన్నపూర్ణ.

ఆ కొత్తదంపతులిద్దరూ ఓర్చాకి చేరాక తాము కూడా కొత్తదంపతులమేనన్న విషయాన్ని వారం రోజులదాకా మరిచిపోయారు రాంసింగ్, హైమవతులు.

ఉదయంనుంచీ సాయంత్రందాకా తర్వాత అర్ధరాత్రిదాకా కూడా వారిద్దరికీ భవానీప్రసాదింట్లో పనులతోనే గడిచిపోయేది.

భవానీప్రసాద్ సెలవు నుంచి తిరిగి వచ్చాక వరుసగా ఓ వారం రోజులు నైట్ పెట్రోలింగ్‌కి బయలుదేరడంతో హైమవతికి దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది రామ్‌సింగ్.

ఆ తరువాత తామిద్దరికీ తీరిక కలిగే రాత్రికోసం ఎంతో ఆదుర్దాగా ఎదురు చూసింది హైమవతి.

చివరికి ఆ రోజు రానే వచ్చింది.

కానీ ఆ రాత్రి హైమవతి జీవితాన్నే కాళరాత్రిగా మార్చేసింది.

●●●

కొందర్ని దురదృష్టం పుట్టకనుంచే వరిస్తుంది.

వారెంతటి సమర్థులయినా కూడాకొన్ని సందర్భాల్లో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. అయితే కష్టాలకి వేదాంత ధోరణిని ఆపాదించుకోకూడదు.

తామిపుడు లోనయిన కష్టాలన్నిటికీ కారణం తామెప్పుడో పూర్వ జన్మలో చేసుకున్న పాపం అనుకోవటం చాలా పొరపాటు.

జీవితంతో రాజీపడి పోవటమెపుడూ గొప్ప విషయం కాదు.

అన్ని సందర్భాల్లోనూ కాంప్రమైజ్ అయిపోవటం అసమర్థతకు చిహ్నంగా భావించాల్సి ఉంటుంది.

మనిషన్నవాడెప్పుడూ తన ఇంగిత జ్ఞానాన్ని ఉపయోగిస్తూ ఉండాలి. పరిస్థితుల ప్రభావాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి.

అలా చేయనివాడు ఎందుకూ పనికిరానివాడుగా మిగిలిపోతాడు.

స్వయంకృతాపరాధాన్ని మించిన దోషం మొకటి లేదు.

చేజేతులా కలుగచేసుకున్న నష్టానికి వారు ఎవరినీ నిందించలేరు.

అలాంటి కోవకి చెందినవాడు ఉగ్రావ్‌సింగ్.

ఉద్యోగరీత్యా తను ఆ అడవిలోని చందేరీ గెస్ట్‌హౌస్‌కే అంకితం కావాల్సి ఉంటుందని ముందే తెలిసిన ఆ పెద్దమనిషి హైమవతి తల్లిని పెళ్ళిచేసుకోవటమే ఓ పొరపాటు. పోనీ చేసుకున్నాక ఆమెని సక్రమంగా గమనించకుండా నిర్లక్ష్యం చేయటం కన్నా నేరం మరొకటేముంటుంది? అందుకే ఆమె మరొకరితో లేచిపోయింది.

ఆ విషయంలో ఆమె నొక్కదాన్నే దోషిగా పరిగణించడానికి వీలులేదు. అందులో ఉమ్రావ్‌సింగ్ తప్పిదమే ఎక్కువగా ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకోవటం అవివేకం అనే విషయాన్ని మాత్రం గుర్తించగలిగాడతను.

తను చేసిన తప్పేమిటో తెలిసాక భార్య గురించి విచారించడం మానుకుని కూతురు హైమవతిని మాత్రం జాగ్రత్తగా పెంచి పెద్దచేశాడు.

కానీ ఉమ్రావ్‌సింగ్ మగ పెంపకంలో హైమవతికి తన ఆడతనం తెలిసిరాలేదు. సాధారణంగా తల్లిద్వారా ఆడపిల్లలకు తమ శారీరక ఇబ్బందులకు ఉపశమనం లభిస్తూ ఉంటుంది. ఆ అదృష్టం ఆమెకి దక్కలేదు. అందువల్ల ఆమెకి స్త్రీపరమైన విషయాలేవీ తెలియలేదు.

ఆ రకంగా తండ్రిపోషణలో పెళ్ళంటే ఏమిటో, సంసారం అంటే ఏమిటో, భార్యాభర్తలమధ్య అనుబంధమంటే ఏమిటో ఏమీ తెలీకుండా చాలా అమాయకంగా పెరిగింది హైమవతి.

కానీ ఇప్పుడు తండ్రికి దూరంగా భర్త ఆశ్రమంలో ఇరుగూ పొరుగూ అంటూ ఏర్పాడ్డాక ఆమెకి అన్ని విషయలూ తెలిసి వస్తున్నాయి. లోకం పోకడ ఏమిటో ఇప్పుడిప్పుడే తెలిసివస్తోంది.

అన్నపూర్ణ, భవానీప్రసాద్‌లు అక్కడికి చేరిన ఓ వారం రోజుల తర్వాత మాత్రమే రామ్ సింగ్ అడవిలోకి వెళ్ళాల్సిన అవసరం కలగలేదు.

ఆ రాత్రికోసమే ఎంతో ఆశగా ఎదురుచూసింది హైమవతి అయితే ఆమెకు చేదు అనుభవాన్ని మాత్రమే అందించగలిగాడు రామ్‌సింగ్.

హైమవతి చేరువకాగానే ఒక్కసారిగా నీరుకారిపోయాడతను. ఆమెను దగ్గరగా పూర్తిగా చూడగలిగిన క్షణం రాగానే ఒక్కసారిగా అతనికి తన వయస్సు గుర్తుకొచ్చేసింది.

రామ్‌సింగ్‌లో కలుగుతున్న మార్పులకు గల కారణమేమిటి హైమవతికి తెలిసిరాలేదు. అందుకు కావలసిన పరిపక్వత ఇంకా ఆమెకు అబ్బలేదు.

ఆ విధంగా హైమవతికి ఆ తొలిరాత్రి కాళరాత్రిగా మారిపోయింది.

ఆ మర్నాటినుంచే రామ్‌సింగ్‌లో చాలా మార్పు వచ్చింది హైమవతికి ఎదుట పడటానికే సంకోచించసాగాడు. అతని ప్రవర్తనవల్ల హైమవతికి తనకు తెలీకుండానే దూరం కాసాగాడు.

తమ సంసార విషయాల్ని బయటకి చెప్పుకోలేక తనలో తాను కుమిలిపోసాగింది హైమవతి. ఆ కారణంగా తన సమయాన్నెక్కువగా అన్నపూర్ణ ఇంట్లోనే గడపటం అలవాటు చేసుకుందామె.

రామ్‌సింగ్ ఇంట్లోనే ఉన్నా హైమవతి ఇంకా తమ ఇంట్లోనే ఏదో పనిని కల్పించుకుని తిరుగుతూ ఉండటాన్ని అన్నపూర్ణ వెంటనే గమనించింది. అయితే ఆ విషయాన్ని హైమవతి ముందు కదిలించలేదామె.

కానీ హైమవతి ఆ చేదు అనుభవానికి గురయి ఓ వారం రోజులు కూడా గడవకముందే ఓర్చా ప్యాలెస్‌ని చేరుకున్నాడు జియాజీరావు. అతని వెంట ఓ రెండు వ్యాన్లనిండా వచ్చిన జనంతో ఆ ప్యాలెస్ ఆవరణంతా సందడితో నిండిపోయింది.

చందేరీ చీరల 'యాడ్ ఫిల్మ్'ని ఆ ఓర్చా ప్యాలెస్‌లో షూట్ చేయటానికి వచ్చాడు జియాజీరావు.

ఫిల్మ్ యూనిట్ వాళ్ళంతా తమ తమ సామాన్లతో ప్యాలెస్ వరండాల్లో సెటిలవటం ప్రారంభించారు.

ఆ రోజు భవానీప్రసాద్, రామ్‌సింగ్‌లు ఉదయమే ఫారెన్ ఇన్స్పెక్షన్‌కి వెళ్ళిపోయారు. వాళ్ళలా వెళ్ళిపోగానే జియాజీరావు కంపెనీ అక్కడికి రావటం జరిగింది.

లోపల తమ ఇంట్లో పనులతో బిజీగ ఉన్న అన్నపూర్ణా, హైమవతులు సినిమా వాళ్ళు ఆ ప్యాలెస్ ఆవరణలోకి వచ్చిన విషయాన్ని గమనించలేదు.

ఆ సమయంలోనే మంచినీళ్ళ ఏర్పాటుకోసం వచ్చి భవానీ ప్రసాద్ ఇంటి తలపుని తట్టాడు జియాజీరావు.

ఆ సమయంలో అన్నపూర్ణ పూజలో కూర్చుని ఉంది. హైమవతి వెళ్ళి తలుపు తీసింది.

ఆమెనక్కడ చూడగానే ఆశ్చర్యంతో కొయ్యబారిపోయాడు జియాజీరావు. అతన్ని హైమవతి గుర్తించలేదు.

తననెంతో ఆకర్షించిన ఉమ్రావ్‌సింగ్ కూతురపుడు వెంటనే పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయిందని తెలిసిన జియాజీరావు ఎంతో నిరాశకు గురి అయ్యాడా క్షణంలో.

కానీ ఇపుడిలా ఆమె హఠాత్తుగా తటస్థపడేసరికి తనకి నోట మాటరాకుండా పోయింది.

వచ్చి నిలబడిన మనిషి ఏ మాటా లేకుండా తనవంక వెర్రిగా చూస్తూ ఉండటంతో ఏం చేయాలో పాలుపోక వెంటనే లోనికెళ్ళిపోయింది హైమవతి.

ఆ తర్వాత అన్నపూర్ణ వచ్చి జియాజీరావుతో మాట్లాడి కావాల్సిన సహకారాన్నందించింది.

జియాజీరావు ఫిల్మ్ యూనిట్ ఆ ప్యాలెస్ ఆవరణలో ఓ వారం రోజులు గడిపే సన్నాహాలతో అక్కడికి చేరుకున్నారు.

ప్యాలెస్‌లోని షూటింగ్ వ్యవహారాలే కాకుండా అక్కడికి దాపులోని అడవిలోకూడా వారికి కావాల్సిన ఏర్పాట్లు జరిగిపోయాయి.

ఆ ఫిల్మ్ షూటింగ్‌లో పాల్గొనటానికి వచ్చిందో యువతి. ఆ ఆర్టిస్టుతో రాత్రిళ్ళు గడిపేద్దామనుకున్న జియాజీరావు కాస్తా హైమవతిని అక్కడ చూడగానే ఆ ఆలోచనల్ని మానుకున్నాడు.

మొదటి రోజు సాయంకాలం అవగానే ఆ ఆర్టిస్ట్ లేడీ బిక్కు బిక్కుమంటూ ప్యాలెస్ ముందు నిలబడి ఉండటాన్ని తమ వాటాలో నుంచే గమనించింది అన్నపూర్ణ.

ముందు వేసుకున్న ప్లాన్ ప్రకారం తనూ ఆ మోడల్ గర్ల్ ఇద్దరూ టౌన్‌లోని హోటల్లోకి మారుదామనుకున్నాడు జియాజీరావు. కానీ ఇప్పుడు ఇక్కడ హైమవతిని చూసేసరికి ఆ ప్లాన్‌ని అమల్లోకి తీసుకురావటం అతనికి ఇష్టం లేకుండాపోయింది.

దాంతో ప్యాలెస్ ఆవరణలోనే తనకూ, ఆ మోడల్ గర్ల్‌కి ఓ రెండు వేరు వేరు టెంట్స్‌ని వేయమంటూ పనివాళ్ళని పురమాయించాడతను.

ఇదంతా జరుగుతున్నప్పుడే భవానీప్రసాద్ ఆఫీసునుంచి తిరిగి వచ్చాడు జీపుని పార్క్ చేసేసి రామ్‌సింగ్ కూడా తన వాటాలోకి వెళ్ళిపోయాడు.

భవానీప్రసాద్ దుస్తుల్ని మార్చుకుని వచ్చాక అతనికి కాఫీ ఇస్తున్నప్పుడు సినిమా వాళ్ళతో వచ్చిన ఆ అమ్మాయి విషయం అన్నపూర్ణకి జ్ఞాపకం వచ్చింది. దాంతో గబగబా వెళ్ళి ప్యాలెస్ వంక చూసిందామె.

ఫిల్మ్ యూనిట్ వాళ్ళందరికీ దూరంగా వేసివున్న ఓ టెంట్ ముందు భయం భయంగా నిలబడి ఉందా అమ్మాయి. ఆమెనలా చూసేసరికి అన్నపూర్ణకి జాలివేసింది.

ఎంత మోడల్ గర్ల అయినా ఆమె ఓ ఆడది.

ఆ పిల్లనలా ఒంటరిగా చూసేసరికి ఆ రాత్రిఏం జరుగుతుందోనని భయం ఆవహించింది.

ఆకారణంగా జియాజీరావు, భవానీప్రసాద్‌ల అనుమతితో ఆ పిల్లని తమ ఇంట్లో ఉండాల్సిందిగా కోరింది అన్నపూర్ణ.

తను తీసుకొచ్చిన ఆ మోడల్ గర్ల్‌కి భవానీప్రసాద్ ఇంట్లో ఆశ్రయం లభించటంతో జియాజీరావుకి చిరాకు ముంచుకొచ్చింది. యాడ్ ఫిల్మ్‌లో నటించే మోడల్ గర్ల్స్‌తో గడపటం జియాజీరావుకు సర్వసాధారణ విషయం.

కానీ ఈసారి అతను ఓ రెండు రాత్రుల్ని ఒంటరిగా వెళ్ళదీయాల్సి వచ్చింది. కేవలం 'మందు' మాత్రమే అతనికి కంపెనీ ఇచ్చింది.

మూడవరోజు సాయంకాలం భవానీ ప్రసాద్‌ని ఇంట్లో వదిలేసాక జీపుని రిపేరుకోసం షెడ్‌లో వదిలేసి వస్తానని వెళ్ళాడు రామ్‌సింగ్. కానీ మెకానిక్ అతన్నక్కడే ఆపేసాడు. రిపేరు తర్వాత బండిని 'టయల్'కి తీసుకువెళ్ళాల్సి ఉండటంతో అతనక్కడే ఉండిపోవలసి వచ్చింది.

ఆ రాత్రి వర్షం వచ్చే సూచనలు ఏర్పడ్డాయి.

ఆకాశం నిండా నల్లని మబ్బులు అలుముకుని ఉన్నాయి.

భవానీప్రసాద్ ఇంట్లో ఉండడంతో హైమవతి తమ వాటాలోనే ఉండిపోవాల్సి వచ్చింది.

బయట అలుముకుంటూన్న ఆ చల్లని వాతావరణం ఆమెని కొంచెం మధురానుభవాన్ని కోరుకునే విధంగా ఆలోచనలకి గురిచేయసాగింది.

ఆ కారణంగా ఇంకా భర్త మీద ఆశని పూర్తిగా కోల్పోకుండా అతని రాకకోసం ఎదురు చూస్తోందామె.

అంతలోనే వర్షం ప్రారంభమయింది.

క్షణాల్లోనే కుండపోత మొదలయింది.

అప్పుడు తన టెంట్లో మందు నాలుగో రౌండ్‌లోకి వచ్చాడు జియాజీరావు.

వెలుపల కురుస్తున్న వర్షం వలన చల్లబడిపోతున్న పరిసరాలూ, కడుపులో పడిన మందు కలిగిస్తూన్న వేడి అతన్ని కదిలించివేయసాగాయి. ఏదో రకంగా ఆ లేడీ ఆర్టిస్టుని తన టెంట్ కు రప్పించుకోవాలనే బలమైన నిర్ణయానికి వచ్చేశాడతను.

ప్యాలెస్ వెనకనున్న తన గుడారాన్నుంచి ఓ గొడుగు సహాయంతో భవానీప్రసాద్ ఇంటివైపుకు నడిచాడు జియాజీరావు. అతనా ఇంటికింకా చేరకముందే కరెంటు పోయింది.

చీకటిలో ఓ క్షణం ఏం చేయాలో తోచక ఓ చెట్టుక్రింద నిలబడి పోయాడతను. అక్కడినుంచి భవానీప్రసాద్ బంగళా, రామ్ సింగ్ ఉండే వాటా - రెండూ కూడాఅతనికి కనిపించసాగాయి.

అతనలా చూస్తుండగానే వెలిగించిన ఓ లాంతరుతో తమ ఇంటి ముందు వరండాలో ఉంటున్న మోడల్ గర్ల్ దగ్గరికి వచ్చాడు భవానీప్రసాద్.

అతనామెకి లాంతరుని అప్పగించేసి వెనుదిరిగి లోనికెళ్ళిపోవడం కనిపిస్తూనే ఉంది జియాజీరావుకు.

అదే సమయంలో తమ వాటాలో ఓ కొవ్వొత్తిని వెలిగిస్తూన్న హైమవతి కనిపించిందతనికి.

హైమవతి అలా కనిపించేసరికల్లా జియాజీరావులో ఒక్కసారిగా మార్పు వచ్చేసింది. ఒంటరిగా కనిపిస్తోన్న ఆమెని చాలాసేపు అక్కడినుంచే గమనించాడతను.

తలపులేని కిటికీల్లోంచి వీస్తోన్న బలమైన గాలికి తమ ఇంట్లో కొవ్వొత్తి ఆరిపోకుండా ఎన్నోసార్లు ప్రయత్నంచేసింది హైమవతి. చివరకు విసిగిపోయి ఆ చీకట్లోనే మంచంపై వాలిపోయిందామె.

ఆ చీకట్లో పడుకుని కిటికీలోనుంచి వీస్తూన్న గాలీ, బయట మెరుస్తున్నప్పుడు కనిపించే వర్షపు దృశ్యమూ తన్మయత్వం కలిగిస్తుండగా హాయిగా కళ్ళుమూసుకుందామె.

మళ్ళీ హైమవతి ఇంట్లో వెలుగు కనిపించకపోవటం జియాజీరావుకు ఆశ్చర్యపరచింది.

అలా ఆశ్చర్యపడుతూనే భవానీప్రసాద్ ఇంటిముందు రోజూ పార్క్ చేసి ఉండే జీపు కోసం చూసాడతను.

ఆ బండి అక్కడ కనిపించలేదు. జీపు అక్కడ కనిపించకపోయేసరికల్లా ఒక్కసారిగా జియాజీరావు బుర్రలో ఓ మెరుపు మెరిసింది.

రామ్‌సింగ్ ఇంట్లోలేడని తెలిసిపోయిందతనికి. ఆ విషయం తెలియగానే జియాజీరావులోని వివేకం కాస్తా నశించిపోయింది.

'కోరిక'తో నిండిన బలమైన ఓ రాక్షసుడతనిలోకి వెంటనే ప్రవేశించాడు.

ఆ రాక్షసుడు పదినిమిషాల్లో పరిసరాల్ని గమనించే ఇంగితజ్ఞానాన్ని కోల్పోయాడు.

దాంతో గబగబా రామ్‌సింగ్ ఇంటివైపు నడిచాడు జియాజీరావు.

తమ వాటా తలుపు త్రోసిన చప్పుడు కాగానే రామ్‌సింగ్ లోని కొచ్చాడనుకుంది హైమవతి.

అప్పటికే ఓ రకం మత్తుని అలుముకునేలా చేసుకుని చీకట్లో ఉన్న భర్త తనని ఏం చేస్తాడో చూద్దామని సరదాగా అలాగే కూర్చుని ఉండిపోయిందామె.

జియజీరావు నేరుగా హైమవతి కూర్చుని ఉన్న మంచం వద్దకు వెళ్ళిపోయాడు.

విస్కీవాసన గుప్పుమనగానే భర్త ఆరోజు మందుని సేవించి వచ్చాడనుకుంది. అయితే తను వచ్చినప్పటినుంచీ రామ్‌సింగ్ తాగటాన్ని ఆమె చూసి ఉండలేదు.

ఆ కారణంగా ఆశ్చర్యపోతున్న ఆమెని బలంగా ఆక్రమించుకున్నాడు జియాజీరావు.

తనలోని వేడి చల్లారిపోగానే ఒక్కసారిగా తను చేసిందేమిటో అర్ధమయిపోయి భయంతో దిగ్గున లేచి నిలబడిపోయాడు జియాజీరావు.

కానీ జీవితంలో తొలిసారిగా లైంగిక సుఖాన్నందుకున్న హైమవతి ఇంకా ఆ అనుభవంలోనుంచి తేరుకోలేదు. ఆ కారణంగా అతను లేచిపోయే ప్రయత్నాన్ని అడ్డుకుంది.

హైమవతి తనను లేవనీయకుండా మరింత గట్టిగా అదుముకుంటూ ఉండేసరికి జియాజీరావు మరింతగా భయపడిపోయాడు. ఆ కంగారులో ఓ రెండు వాక్యాలతని నోటినుంచి వెలువడ్డాయి.

"రామ్‌సింగ్ రావచ్చు. నన్ను త్వరగా వెళ్ళిపోనీ"

జియాజీరావు గొంతు వింటూనే హైమవతి మత్తు కాస్తా పటాపంచలైపోయింది. వెంటనే మంచంలోనుంచి ఛెంగున లేచి నిలబడిందామె.

ఆమె గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్దలయ్యాయి.

ఆమె మనస్సు వెయ్యిముక్కలుగా విరిగిపోయింది.

అంతవరకూ తనని అనుభవించి వెళ్ళిపోయిన జియాజీరావు నోటి నుంచి వెలువడిన ఆ రెండు వాక్యాలే ఆమె చెవుల్లో ప్రతిధ్వనించసాగాయి.

ఆ సమయంలో తనకేం జరిగిందో తెలుసుకున్న ఆమె భయంతో నోట్లోకి వస్తున్నట్లుగా, గొంతు పూడుకుపోతున్నట్లుగా కావటంతో కళ్ళు తేలవేస్తూ నేలపైకి కుప్పలా జారిపోయింది హైమవతి.

●●●

కుంభవృష్టి కొనసాగుతూనే ఉంది.

"ఈ వర్షం తగ్గేలా లేదు. తెల్లవార్లూ పడేట్టుంది" అంటూ బీడీని వెలిగించుకున్నాడు జీపు మెకానిక్.

ఆ షెడ్‌లోని ఓ రేకు డబ్బాపై అన్యమనస్కంగా కూర్చుని ఉన్న రామ్ సింగ్ అతని మాటల్ని వినిపించుకోలేదు.

అతని ఆలోచనల్ని భార్య హైమవతిపైనే కేంద్రీకృతమై ఉన్నాయి. ఇప్పుడామె ఒక్కత్తే బిక్కుబిక్కుమంటూ ఈ వర్షంలో తనకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. జీపుని మెకానిక్ దగ్గర వదిలేసి వస్తానని చెప్పి వచ్చి తనిక్కడే గత మూడుగంటల కాలాన్ని వెళ్ళదీయాల్సి రావడంతో అతనికి చాలా చిరాకుగా ఉంది.

విసుగ్గా లేచి నిలబడి వీధిలోకి తన దృష్టిని సారించాడు.

వర్షం తగ్గే సూచనలు ఏమాత్రమూ కనిపించలేదు.

మెకానిక్ షెడ్ ముందు వెలుగుతున్న దీపం వెలుగులో వర్షం తీవ్రత మరింతగా గోచరిస్తోంది.

ఆ వాతావరణాన్ని గమనించగానే అడవిలో జరగగలిగే కార్యకలాపాలు ఒక్కసారిగా అతనికి ఊహారూపకంగా కళ్ళముందు కనిపించసాగాయి.

వర్షం ఇలా కురుస్తున్నప్పుడు అడవుల్లో దొంగతనాలు అధికంగా జరిగిపోతుంటాయి. అనుమతి పొందిన దళారులు కోసి పడవేసుకున్న కలపతోపాటుగా అనధికారికంగా నేలకూల్చిన పెద్దపెద్ద టేకు చెట్లుకూడా ఇలాంటి సమయాల్లోనే తెల్లవారేసరికల్లా మాయమయిపోతాయి. అంతపెద్ద వర్షాన్ని కూడా లెక్కచేయకుండా మన రంపాల్ని ఉపయోగిస్తూ చెట్లని కూల్చేస్తుంటారా అడవి దొంగలు. అలాంటి అవకతవకల్ని అరికట్టేందుకు అటవీశాఖ వారికి రాత్రుల్నీ యమ యాతనల్ని రుచిచూపిస్తాయి.

"ఇప్పుడు కురుస్తూన్న ఈ వర్షంలో అడవిలో ఏం జరుగుతుందో ఏమో? భవానీప్రసాద్‌కే క్షణంలోనయినా పిలుపురావచ్చు. అందువల్ల తను వెంటనే ఇంటికి వెళ్ళిపోవడం చాలా అవసరం" అనుకున్నాడు రామ్‌సింగ్. ఆ ఆలోచన రాగానే మెకానిక్ వంక తిరిగాడు.

"మెకానిక్ భయ్యా కాస్త త్వరగా బండిని సిద్ధంచెయ్యి. నేను వెళ్ళి భోంచేసి వస్తాను. ఈ వర్షంలో అడవిలోకి వెళ్ళక తప్పేట్టులేదు" అంటూ గబగబా వీధిలోకి పరిగెత్తాడు.

ఓర్చా ప్యాలెస్ పరిసరాల్లోకి రాగానే అక్కడ కరెంట్ పోయిన విషయం రామ్‌సింగ్‌కి తెలిసింది.

ఆ పరిస్థితిలో ఇంట్లో ఒంటరిగా ఉన్న భార్యని గుర్తుచేసుకోగానే అతనికి ఆమెపై జాలివేసింది.

ఆ కారణంగా తన నడక వేగాన్ని పెంచాడు.

ఇంటిని చేరగానే దగ్గరగా వేసిఉన్న తలుపు సులభంగానే తెరుచుకుంది. లోపల హైమవతి అలికిడి వినిపించలేదు.

"హైమా!" పిలిచాడు రామ్‌సింగ్.

భార్యనుంచి సమాధానం రాకపోయేసరికి ఆమె ఇంకా భవానీప్రసాద్ ఇంట్లోనే ఉండవచ్చుననుకున్నాడతను. దాంతో చీకట్లో వెదుక్కుంటూ తాము సాధారణంగా కొవ్వొత్తి, అగ్గిపెట్టెల్ని ఉంచే స్టాండువైపుకు నడిచాడు.

అగ్గిపెట్టె చేతికందగానే గీసిన అగ్గిపుల్ల కాస్తా వెంటనే ఆరిపోయింది. ప్రక్కనే ఉన్న కిటికీలోంచి వర్షపుజల్లులూ, చలిగాలీ విసురుగా లోనికి దూసుకొస్తున్నాయి.

పాతకాలం నాటి తలుపులేని కిటికీ కావడంతో గాలిని అరికట్టడం అతనికి కష్టంగా తోచింది. ఏం చేయాలో తోచక ఓ క్షణం ఆలోచించాడు.

వెంటనే అతనికి ఆ గది మూలలో ఉన్న జెరికన్ విషయం గుర్తుకొచ్చింది. జీపుకోసం డీసెల్ ఆయిల్‌ని అందులో నిలువచేసి ఉంచడం జరుగుతూ ఉంటుంది. ఆ జెరికని తీసుకొచ్చి కిటికీకి అడ్డంగా నిలబెట్టాడు.

ఆ అడ్డువల్ల గాలితీవ్రత చాలావరకు తగ్గిపోయింది. అప్పుడు కొవ్వొత్తిని వెలిగించాడు రామ్‌సింగ్.

ఆ వెలుగులోగదిలోనేలపై వెల్లకిలా పడివున్నా హైమవతిని చూడగానే అతని పై ప్రాణాలు కాస్త లేచివచ్చాయి.

భార్య దాదాపు నగ్నంగా పడి ఉన్న తీరూ, ఆమె ఒంటిమీదనుంచి ఊడి పడివున్న దుస్తుల్ని చూడగానే అతనికి జరిగిందేమిటో వెంటనే బోధపడిపోయింది.

ఒళ్ళు ఒణుకుతుండగా కంగారుగా భవానీప్రసాద్ ఇంటికి పరిగెత్తబోతున్న రామ్‌సింగ్ తమ గుమ్మంలోంచి వెళ్ళేటప్పుడు కొద్దిగా తలవంచి వెళ్ళాలన్న విషయాన్ని మరిచిపోయాడు. దాంతో ఆ గుమ్మం నుదుటికి బలంగా తగిలిన దెబ్బతో అతని కళ్ళముందు చీకట్లు కమ్ముకున్నాయి. కొంచెం తేరుకున్నాక భార్యవంక చూశాడు, హైమవతి ఇంకా వెల్లకిలా పడిపోయే ఉంది.

అతి కష్టంగా శ్వాసని అందుకోగలుగుతోంది. భార్యనా స్థితికి లాగిందెవరో రామ్‌సింగ్‌కి ఎంతకూ అంతుబట్టలేదు. ఎంత బుర్రని బద్దలుకొట్టుకున్నా అతనికి చూచాయగా కూడా ఏ వ్యక్తీ ఊహకందడంలేదు.

ఎదురుగా ఉన్న భవానీప్రసాద్‌ని అనుమానించాల్సిన అవసరంలేదు. తనలాగే కొత్తగా పెళ్ళయిన భార్యతో అతనీ రాత్రి సుఖంగా గడుపుతూ ఉంటాడు.

అలాంటప్పుడు ఎవరు ఈ సాహసానికి పూనుకుని ఉంటారు?

ఒక వేళ ఓర్ఛా ప్యాలెస్‌లో మకాం వేసి ఉన్న సినిమావాళ్ళలో నుంచి ఎవరైనా ఈ దుష్కృత్యానికి పాల్పడి ఉంటారా? ఆ ఆలోచన రగానే ఇంట్లోనుంచి బయటకి పరిగెత్తాడు రామ్‌సింగ్.

అప్పుడే ఆకాశం ఓసారి గర్జించింది.

ఆ ఉరుముని వెన్నంటి వచ్చిన మెరుపు కాంతిలో ఎదురుగా ఉన్న ఓర్ఛా ప్యాలెస్ సముద్రంలో మునిగిపోతున్న ఓడలా కనిపించింది. ఆ భవనం వరండాలు నిర్మానుష్యంగా ఉన్నాయి. కానీ అనుమానం ఇనుమడిస్తుండగా ఆ వర్షంలో తడుస్తూ ప్యాలెస్ వంక నడిచాడతను. బంగళా వరండాలో సినిమావాళ్ళంతా మంచి నిద్రలో ఉన్నారు. ఉదయం నుంచీ నానా శ్రమపడిన ఆ జీవులు కొంచెం ముందు పుచ్చుకున్నాక భోంచేసి పడుకున్న లక్షణాలన్నీ మసకచీకట్లో కూడా బాహాటంగాకనిపిస్తున్నాయి.

పడుకున్న వాళ్ళందరినీ గమనిస్తూ కొద్దిసేపు అక్కడే నుంచున్నాడు రామ్‌సింగ్.

ఎవరైనా నటిస్తున్నారేమోనని వారందరినీ నిశితంగా పరిశీలించాడతను. కానీ ఎవరూ కూడా అతని కంటికి దోషిగా కనిపించలేదు.

ఇక అక్కడినుంచి కదలబోతుండగా బంగళా వెలుపలున్న జియాజీరావు టెంటు కనిపించింది. ఆ వైపు నడిచాడు రామ్‌సింగ్.

టెంటులోని మంచంలో జియాజీరావు తాగిన మైకంలో ఒళ్ళుతెలీని నిద్రలో ఉన్నాడు.

హైమవతిని వదిలి వచ్చాక భయంతో టెంటులో ఉన్న విస్కీ మొత్తాన్ని నీళ్ళు లేకుండా ఖాళీచేసాడతను.

జియాజీరావు స్థితిని చూసిన రామ్‌సింగ్‌కి అతనిపైకూడా ఏ అనుమానమూ కలుగలేదు.

ఆ కారణంగా అక్కడ నిలబడటం మానుకుని తన వాటావైపు నడిచాడు.

ఇంట్లోకి అడుగుపెట్టగానే అతని గుండెలనిండా ఆవేదన అలుముకోసాగింది.

గభాలున భార్య ప్రక్కనే చతికిలబడిపోయాడు. శీలాన్ని కోల్పోయి అచేతనంగా పడివున్న హైమవతినలా చూస్తుంటే రామ్‌సింగ్‌లో ఎలాంటి భావమూ ఉత్పన్నం కాలేదు.

ఆమెపై కోపమూ, అసహ్యమూ బదులుగా అతనికి తనపైన తనకే జాలిపుట్టుకొచ్చింది.

కట్టుకున్న ఆడదాన్ని మరెవరో వచ్చి అనుభవించి వెళ్ళిపోతే తాను ఏమీచేయలేని నిస్సహాయస్థితి ఏర్పడింది. చేతులుకాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఏముంటుంది.

హైమవతిని స్పృహలోకి తీసుకొచ్చి విషయాన్ని సేకరిస్తే మాత్రం చేయగలిగేదేముంది?

ఆమెనీ స్థితిలో ఏ విధంగా కదిలించాలి? తను భర్తగా ఆమెకేం న్యాయం చేసాడని తన అధికారాన్ని ఆమెపై చెలాయించాలి? బలత్కారానికి గురైన ఆమెని ఏ రకంగా ప్రశ్నించాలి?

శీలాన్ని కోల్పోయిన బాధకు తోడుగా తానిప్పుడేం చేసినా కూడా హైమవతిని మరింత అన్యాయానికి గురిచేసినట్లే అవుతుంది.

తమ పెళ్ళయ్యాక ఒక్కసారి కూడా తన ఉంచి శారీరక సుఖాన్ని పొందని భార్యని చూస్తుంటే రామ్‌సింగ్ కళ్ళనీళ్ళని నింపుకున్నాయి.

తను చెడిపోయిన విషయం తనకి తెలిసిపోయిందని తెలిస్తే ఆ అమాయకురాలు ఏ అఘాయిత్యానికి ఒడిగడుతుందో ఏమో? అశక్తుడయిన తను ఆమెకు భర్తగా అనర్హుడు.

అలాంటప్పుడు ఆమెను మరింత దుఃఖంలో ముంచే అర్హత తనకు లేదు.

ఆ నిర్ణయానికి రాగానే మరో క్షణం కూడా ఇంట్లో ఉండదలచుకోలేదు రామ్‌సింగ్. జీప్ మెకానిక్ దగ్గరకు వెళ్ళాలనుకుంటూ వెంటనే బయలుదేరాడు.

కానీ వెళ్ళేముందు కిటికీలోని డీసెల్ జరికేన్‌ని, ఆర్పేసిన కొవ్వొత్తిని, అగ్గిపెట్టెని వాటి వాటి యధాస్థానాల్లోకి చేర్చివెళ్ళాడు.

కిటికీలోంచి గాలి రయ్‌మంటూ వీస్తూనే ఉంది. వెలుపల ఉరుములూ మెరుపుల హడావుడి కొనసాగుతూనే ఉంది.

ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తూనే ఉంది.

రామ్‌సింగ్ వెళ్ళిపోయాక సరిగ్గా ఓ అరగంట తర్వాత కరెంటు వచ్చింది.

అప్పుడే హైమవతిలో కూడా కదలిక ఏర్పడింది. కానీ వెంటనే స్పృహలోకి రాలేదామె.

చాలాసేపు తర్వాత అతికష్టంగా మేలుకుంది హైమవతి. తనకేం జరిగిందో గుర్తుకురాగానే ఆమె గుండెలు కాస్తా గుభేల్ మన్నాయి. భయంతో ఒణికిపోతూ లేచి నిలబడబోయింది.

కానీ శరీరం ఆమెకి సహకరించలేదు. తన స్థితీ, తన బట్టల దుస్థితీ బోధపడగానే ఆమె గొంతు పూర్తిగా ఆరిపోయినట్టయింది. ఒంటినిండా చెమటలు ముంచుకు రాసాగాయి. భయంతో చుట్టూ చూసింది. రామ్‌సింగ్ కనిపించలేదు.

భర్తని తలచుకోగానే తాను అంతక్రితం లోనయిన ఆపద పరంగా ఆమె శరీరం అసహ్యంతో కంపించసాగింది.

వచ్చినవాడు భర్తేననుకుని తాను ఓ అపరిచితుడికి తనని తాను అర్పించుకుంది.

భర్తతో తనకెలాంటి అనుభవమూ లేని తను ఆ చీకట్లో మోసగించబడడంలో తన దోషం ఎంతో ఆమెకి బోధపడలేదు. తననిఅలా లోబరచుకున్న వ్యక్తి ఎవరై ఉంటారు?

అతని కంఠస్వరం మాత్రం తనకు జీవితాంతం వరకూ గుర్తుండిపోక తప్పదు.

అనుక్షణమూ ఆ గొంతు తన చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది.

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments